విశాలాంధ్ర గోదావరి జిల్లా

ఏలూరు, పశ్చిమగోదావరి

లక్ష్యాలు సకాలంలో పూర్తి చేయాలి

కలెక్టర్ ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి అన్నారు.శుక్రవారం జిల్లా కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి రీ సర్వే, అసైన్డ్ భూములు, సివిల్ సప్లై ,గృహ నిర్మాణం, అడంగల్స్, ఎలక్షన్స్, హౌస్ టూ హౌస్ వెరిఫికేషన్, భూ సేకరణ, టూరిజం ప్రాజెక్ట్, మీసేవ, వాటర్ టాక్స్, ఓటీఎస్, సిసిఆర్ సి, ఓటియస్ రిజిస్ట్రేషన్లు, పియం కిసాన్ తదితర 16 అంశాలపై జిల్లాలోని అన్ని మండల అధికారులతో కలెక్టరు వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండలాల వారీగా ప్రగతిని ఆమె అడిగి తెలుసుకున్నారు. లక్ష్యసాధనలో వెనుక బడిన మండలాల అధికారులపై అసహనం వ్యక్తం చేశారు. జిల్లాలో మూడవ దశ రీసర్వే పనులు నేటి నుండి మొదలు అయ్యాయని, 18 మండలాల్లో 104 గ్రామాల పనులు వేగవంతంగా

జరగాలన్నారు. రెండవ దశ రీసర్వే విజయవంతంగా పూర్తి చేసుకున్నామని, మిగిలిన సర్వే రాళ్ళను పాతించి రైతులకు అప్పగించాలని తహశీల్దార్లును ఆమె ఆదేశించారు. మూడవ దశ 104 గ్రామాలకు 100 ఓఆర్ఐలు వచ్చాయని మిగిలిన 4 ఓఆర్ఐలు సర్వే ఆఫ్ ఇండియా నుండి త్వరి తగతిన రప్పించాలని జిల్లా సర్వే అధికారిని ఆమె ఆదేశించారు. మూడవ దశ రీ సర్వే గ్రామాల్లో ప్రతి రైతుకు సమా చారం ఇవ్వాలని వారి సమక్షంలోనే రీ సర్వే జరిగితే అనుమానా లకు, వివాదాలకు తావు ఉండదన్నారు. ఈ విషయంలో నిర్లక్ష్యం, అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తప్పవని ఆమె హెచ్చరించారు. మూడవ దశ సర్వే కు సంబంధించి డివిజన్ స్థాయిలో కమాండ్ కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటు చేయాలని ఆర్డీవోలకు జిల్లా కలెక్టరు ఆదేశించారు. జిల్లాలో ఇప్పటికే పూర్తయిన జగనన్న కాలనీ గృహాలలో మౌళిక వసతులను, గృహప్రవేశాలు పూర్తి చేయాలన్నారు. విద్యుద్దీకరణ, అంతర్గత రోడ్లు, త్రాగునీటి పనులు తదితర మౌళిక సదుపాయాలు పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారు లను జిల్లా కలెక్టరు పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా సర్వే అధికారి కె జాషువా, గృహ నిర్మాణ శాఖ పిడి డా. ఆర్ సి ఆనంద కుమార్, డియల్డివో కె సిహెచ్ అప్పారావు, డియస్ వో యన్.సరోజ, డ్వామా పిడి యస్టివి రాజేశ్వర రావు, జిల్లా కలెక్టరు కార్యాలయం పరిపాలనా అధికారి అప్పారావు, భూ సేకరణ సెక్షన్ తహశీల్దారు సి హెచ్ రవికుమార్, ఎలక్షన్ సెక్షన్ తహశీల్దారు లక్కు నరసింహా రావు, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు వెన్నుదన్నుగా ఆర్బీకేలు

జిల్లా కలెక్టర్ పి. ప్రశాంతి

విశాలాంధ్ర-భీమవరం: కౌలు రైతులకు వెన్నుదన్నుగా రైతు భరోసా నిలుస్తుందని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు.వైఎస్సార్ రైతు భరోసా ద్వారా రాష్ట్రంలోని పంట సాగుదారు హక్కు పత్రాలు (సీసీఆర్సీలు) పొందిన వారిలో అర్హులైన 1,46,324 ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులు, దేవాదాయ భూముల సాగుదారులకు తొలి విడత రూ.7500 చొప్పున వరుసగా ఐదవ విడత వైఎస్సార్ రైతు భరోసా సాయంగా రూ.109.74కోట్లు, పంట నష్టపోయిన 11,373 మంది రైతులకు ఇన్పుట్ సబ్సిడీగా రూ.11.01కోట్లు మొత్తం రూ.120.75 కోట్ల రూపాయలను రైతుల ఖాతాలకు జమ చేసే కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయం నుండి ముఖ్యమంత్రి జగన్ బటన్ నొక్కి ప్రారంభించారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, సభ్యులు కొట్టి కుటుంబరావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు తదితరులు కార్యక్రమాన్ని వర్చువల్‌గా తిలకించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ కౌలు రైతులు పెట్టుబడి సాయం వినియోగించుకుని ఆర్థిక లబ్ధి పొందాలన్నారు. జిల్లాలో వైఎస్సార్ రైతు భరోసా ద్వారా 6,030 కౌలు రైతులకు రూ.7500 చొప్పున ఐదవ విడత మొదటి దఫా ఆర్థిక సాయంగా రూ.4.52 కోట్లు, పంట నష్టపోయిన 512 మంది రైతులకు ఇన్పుట్ సబ్సిడీగా రూ.33.45 లక్షలు రైతుల ఖాతాల్లో జమచేసినట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కైగాల శ్రీనివాసరావు, సభ్యులు కొట్టి కుటుంబరావు, జిల్లా వ్యవసాయ అధికారి జెడ్. వెంకటేశ్వరరావు, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి ఎ.దుర్గేష్, వ్యవసాయ అనుబంధ శాఖ అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

మెగా వైద్య, రక్తదాన శిబిరం

విశాలాంధ్ర- ఉంగుటూరు : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ పుట్టినరోజు సందర్భంగా పల్లె ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సహాయం అందించాలనే లక్ష్యంతో మెగావైద్య శిబిరాన్ని నిర్వహించినట్టు ఉంగుటూరు నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శుక్రవారం ఉంగుటూరు మండలం గోపీనాథపట్నం గ్రామంలో శ్రీ లక్ష్మీ నారాయణ అన్నదాన సత్రం ప్రాంగణంలో పవన్ కళ్యాణ్ పుట్టినరోజు వేడుకలలో భాగంగా మెగా రక్తదాన, వైద్య శిబిరం నిర్వహించారు. ఏలూరు ఆశ్రమం హాస్పిటల్, విజయవాడ మణిపాల్ హాస్పిటల్, భీమవరం విష్ణు కాలేజీ వైద్య నిపుణుల ప్రోద్బలంతో శ్రీ లక్ష్మీ నారాయణ ఫౌండేషన్ చైర్మన్ ఉంగుటూరు నియోజకవర్గం జనసేన పార్టీ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు సహకారంతో పేదలకు ఉచిత వైద్య సదుపాయాలు అందజేశారు. విజయవాడకు చెందిన మణిపాల్ హాస్పిటల్ వైద్య బృందం క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఏలూరు ఆశ్రమానికి చెందిన,కంటి నిపుణులు,జనరల్ వైద్యులు, స్త్రీల ప్రసూతి వైద్యులు,చెవి ముక్కు గొంతు వైద్యులు,చర్మవ్యాధుల నిపుణులు,గుండె సంబంధిత నిపుణులు,భీమవరం విష్ణు కాలేజ్ డెంటల్ వైద్యులు 614మందికి ఉచిత పరీక్షలు నిర్వహించారు. పవన్ కళ్యాణ్ అభిమానులు,జనసేన నాయకులు, జనసైనికులు 170మంది రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పి ఏ సి సభ్యులు వేగేశ్న కనకరాజు సూరి, జనసేన పార్టీ రాష్ట్ర కార్యదర్శి ఘంటశాల వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

లోకేష్‌కు వినతిపత్రం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర సందర్భంగా కొయ్యలగూడెం మండలం గవరవరం గ్రామంలో గవరవరం గ్రామానికి చెందిన వైయస్సార్ పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షుడు శీమకుర్తి సత్యనారాయణ లోకేష్ కు వినతి పత్రాన్ని అందజేశారు. లోకేష్‌తో ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వం గతంలో అధికారంలో ఉండగా గవరవరం రెవెన్యూ పరిధి చొప్పరామన్నగూడెం గ్రామంలో 2017 వ సంవత్సరంలో 68/5లో ప్రభుత్వ భూమి ఉన్నదని ఆ ప్రభుత్వ భూమిలో నిరుపేదలు ఇళ్ళు వేసుకుంటే, పేద ప్రజలపై లాఠీచార్జి జరిపించి వారిని బయటకు గెంటివేసారని అప్పటినుండి ఇప్పటివరకు ప్రభుత్వ భూమి ఖాళీగా ఉన్నదని, ఇళ్ళ స్థలాలు ఇప్పించాలని తెలిపారు.

అల్లు శ్రీనుకు రాష్ట్ర స్థాయి ఉత్తమ అవార్డు

విశాలాంధ్ర- ఉంగుటూరు: ఉంగుటూరు మండలం ఉప్పాక పాడులో సెకండరీ గ్రేడ్ టీచర్‌గా పని చేస్తున్న అల్లు శ్రీనివాసరావుకు 2023సంవత్సర రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు వచ్చిందని ఉంగు టూరు మండల విద్యాశాఖాధికారిణి1 నిమ్మగడ్డ రవీంద్ర భారతి శుక్రవారం తెలియజేసారు. మండల విద్యాశాఖాధి కారి2 కె.శ్రీనివాస రావు, మండల కార్యాలయ సిబ్బంది, ఉపాధ్యాయులు, గ్రామస్తులు, విద్యార్థులు శుభాకాంక్షలు తెలియజేశారు.

చనుబండలో డెంగీ జ్వరాలు

విశాలాంధ్ర-చాట్రాయి: చాట్రాయి మండలం చనుబండ గ్రామంలో డెంగీ జ్వరాలు విజృంభిస్తున్నాయి. పెరుగుతున్న విద్యుత్ కోతలతో దోమలతీవ్రత పెరిగి దోమ కాటు వలన ప్రజలు విషజ్వరాలకు గురవుతున్నారు. శుక్రవారం గ్రామానికి చెందిన తెలుగుదేశం పార్టీ సీనియర్ కార్యకర్త పరసా శ్రీనివాసరావు చేయించుకున్న వివిధ పరీక్షలలో డెంగీ జ్వరం నిర్ధారణ కావడంతో విజయవాడలోని ప్రైవేట్ ఆసుపత్రికి హుటాహుటిన తరలి వెళ్ళి చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వం మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలని విద్యుత్ కోతల నివారణ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

పోషకాహారంతో ఆరోగ్యం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గర్భిణీలు, బాలింతలు, పోషక ఆహారం తీసుకోవడం ద్వారా తమ పిల్లలు ఆయురారోగ్యాలతో ఉంటారని రాష్ట్ర ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమల దేవి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయం వద్ద ఐసిడిఎస్ వారి ఆధ్వర్యంలో పోషక ఆహార వారోత్సవ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన గంజిమల దేవి

మాట్లాడుతూ ప్రభుత్వం ద్వారా అంగన్వాడి కేంద్రాల కు పంపిణీ చేసే పోషక ఆహారాలను గర్భిణీలు, బాలింతలు సక్రమంగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పరింపూడి గ్రామపంచాయతీ సర్పంచ్ ముప్పిడి విజయ కుమారి, వైస్ ఎంపీపీ మట్ట వనజ, మండల మహిళా సమైక్య అధ్యక్షురాలు తోట కృపామణి, ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారిని స్వర్ణ కుమారి, అంగన్వాడి కేంద్రాల సూపర్వైజర్లు,టీచర్లు, గర్భిణులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య

విశాలాంధ్ర - బుట్టాయిగూడెం: పునరావాస కాలనీల్లో పూర్తిస్థాయి విద్య,వైద్య,ఉపాధి అవకాశాలు కల్పించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య అన్నారు. శుక్రవారం సీపీఐ ఏలూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో మూడు దశాబ్దాలుగా పోడు భూములపై జీవనం కొనసాగిస్తున్న గిరిజనులకు ఆ పోడు భూములకు హక్కు పత్రాలు ఇవ్వాలని కె ఆర్ పురం ఐటీడీఏ పిఓ ఎం. సూర్య తేజకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ గత మే నెలలో వేలేరుపాడు, కుక్కునూరు, బుట్టాయిగుడెం మండలాల నుండి సుమారు 1900 హక్కు పత్రాలు ఇప్పించాలని సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకున్నా ఇప్పటివరకు సర్వే నిర్వహించలేదన్నారు. ఏళ్ల తరబడి పోడు భూములపై సేద్యం చేస్తూ జీవిస్తున్న అర్హులైన గిరిజనులకు వెంటనే హక్కు పత్రాలు అందించాలని కోరారు. వలస గిరిజనులకు రేషన్ కార్డ్, ఆదాయ, కుల ధృవీకరణ పత్రాలు అందించి, నిర్వాసిత కాలనీల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. పోలవరం నిర్వాసితులకు తక్షణమే ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, గృహ నష్ట పరిహారం అందజేసి పునరావాసాలకు తరలించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీజిఎస్ రాష్ట్ర అధ్యక్షులు కారం ధారయ్య, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాడిశ రాము, మైసాక్షి వెంకటాచారి, ఏఐఎస్ఎఫ్ జిల్లా ఉపాధ్యక్షులు యర్రా మధు,ఏపీజియస్ కుక్కునూరు మండల కార్యదర్శి వర్మా పాపారావు, నాయకులు తెల్లం వీరమ్మ,ఉడత గంగాదేవి,కురసం సురేష్, సోడే నాగేష్, తుర్లకుంట హనుమంత్, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకోవాలి

ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్

విశాలాంధ్ర-భీమవరం: విద్యార్థులు లక్ష్యాలను నిర్దేశించుకుని జీవితంలో అనుకున్నది సాధించాలని ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ డాక్టర్ సుదర్శన్ పిలుపునిచ్చారు. డాక్టర్ సి ఎస్ ఎన్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ మొదటి సంవత్సరం తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సకుమళ్ల సత్యనారాయణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సానుకూల దృక్పథంతో విద్యార్థులు ముందుకెళుతూ సమాజంలో బాధ్యతగా మెలగాలన్నారు. ప్రపంచ దేశాలన్నీ భారత్ లోని యువతవైపు చూస్తున్నాయని అవకాశాలను అందిపుచ్చుకోవాలి ఆయన విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల జాయింట్ సెక్రటరీ వడుపు గోపి, కామర్స్ హెడ్ బొమ్మదేవర ప్రభాకర్ రావు, వైస్ ప్రిన్సిపల్ రమణ, చీడే కృష్ణారావు, ఎంబీఏ హెచ్ఓడి సత్య కృష్ణ, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలీసు నియామక పరీక్షల పర్యవేక్షణ

విశాలాంధ్ర -ఏలూరు క్రైమ్: ఏలూరు రేంజ్ పరిధిలో పోలీసు యస్ఐ నియామక ప్రక్రియలో భాగంగా 6 వ రోజు ఏలూరు రేంజ్ డీఐజీ జివిజి అశోక్ కుమార్ పర్యవేక్షణలో ఏలూరు పోలీసు పెరేడ్ గ్రౌండ్స్ మైదానంలో కొనసాగుతున్న సబ్ ఇన్స్పెక్టర్ పురుషులు, మహిళలు ఏ .పి.ఎస్.పి అర్.ఎస్.ఐ అభ్యర్థుల ఈ వెంట్స్ పరీక్షలను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పోలీసు రిక్రూట్మెంట్ బోర్డు చైర్మన్ అతుల్ సింగ్ సందర్శిం చారు. సెలక్షన్ జరిగే ప్రక్రియను ఏలూరు రేంజ్ డీఐజీ జి.వి.జి అశోక్ కుమార్, ఏలూరు జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి , కాకినాడ జిల్లా ఎస్పీఎస్ సతీష్ కుమార్ తో కలిసి పరిశీలించి పోలీసు అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి ఎస్ఐ అభ్యర్థుల సెలక్షన్స్‌కు సంబంధించిన ఏర్పాట్లు పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

కుల ధ్రువీకరణ పత్రాలు ఇవ్వాలి

రెవిన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన

విశాలాంధ్ర - ముదినేపల్లి : కులధ్రువీకరణ పత్రాలు మంజూరు చేయాలంటూ ముదినేపల్లి మండలం గురజ గ్రామ ఎస్టి కాలనీవాసులు పెద్ద ఎత్తున రెవెన్యూ కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ ఏడు దశాబ్దాల క్రితం శ్రీకాకుళం, విజయనగరం పరిసర ప్రాంతాల నుండి వచ్చి

ఇక్కడ స్థిరపడ్డామని, తమ కులం నుండి ఇద్దరు సర్పంచులు పనిచేశారని కొందరికి మాత్రమే కులధ్రువీకరణ పత్రాలు రెవెన్యూ అధికారులు ఇచ్చారన్నారు. కులదృవీకరణ పత్రాలు ఇమ్మంటే గతంలో ఉన్న జిల్లా నుండి మైగ్రేషన్ పత్రం తెచ్చుకోవాలని అక్కడికి వెళ్లి అడిగితే ఇవ్వమని చెబుతున్నారని పేర్కొన్నారు. కులధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో చదువులు మధ్యలో ఆపివేసి చేతి పనులు చేసుకుంటున్నామన్నారు. ఉద్యోగాలు లేక ఇతర ప్రభుత్వ రాయితీలు అందక ఆర్థికంగా ఇంకా వెనుకబడుతున్నామని వెంటనే తమ సమస్యను పరిష్కరించాలని తహసీల్దార్ కె. శ్రీనివాస్ కు వినతి పత్రం అందజేశారు.త్వరలో సమస్య పరిష్కరిస్తామని తహసీల్దార్ వివరిం చారు. ఈ కార్యక్రమంలో కాలనీవాసులు చేడిక దుర్గా పవన్ కళ్యాణ్, చేడిక గోపి రామకృష్ణ, తాడిగుడి సాయి కిషోర్, జె.దుర్గాప్రసాద్, కోట్ల రాము తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన జీవన ప్రమాణాల కల్పనే లక్ష్యం

విశాలాంధ్ర-ఏలూరు: ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాల కల్పనే లక్ష్యంగా తమ ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని మాజీ ఉప ముఖ్యమంత్రి, ఎమ్మెల్యే ఆళ్ల నాని పేర్కొన్నారు. 111 వ రోజు గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ఆయన శుక్రవారం 9వ డివిజన్ లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఎన్నడూ లేనివిధంగా ఏలూరు నియోజకవర్గంలో సుమారు 30 వేల మందికి ఇళ్ల స్థలాలు మంజూరు చేశామన్నారు. జగనన్న కాలనీలలో మౌలిక సదుపాయాలను యుద్ధ ప్రాతిపదికన అభివృద్ధి చేస్తున్నామన్నారు. రూ.365.55 కోట్ల అమృత్ నిధులతో ఏలూరు నియోజక వర్గం పరిధిలో వివిధ అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టనున్నామని అన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. కార్యక్రమంలో మేయర్ షేక్ నూర్జహాన్, కార్పొరేటర్ సబ్బన శ్రీనివాసరావు, అదనపు కమిషనర్ బాపిరాజు, డిప్యూటీ మేయర్ లు గుడిదేసి శ్రీనివాస రావు, సుధీర్ బాబు, తహశీల్దార్ సోమశేఖర రావు, పలువురు కార్పొరేటర్లు, వివిధ కార్పొరేషన్ల అధ్యక్షులు, నేతలు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ శ్రీధర్ ప్రత్యక్ష రాజకీయాల్లో ఉండాలి

విశాలాంధ్ర - లింగపాలెం : ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్ ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటానని, ఈసారి ఎంపీగా పోటీ చేయబోనని తెలపటంతో ఆయన వర్గీయులలో నిరుత్సాహం చోటు చేసుకుంది. ఎంపీ బుధవారం ధర్మాజీగూడెంలో విశాలాంధ్రతో తన అభిప్రాయం వెల్లడించారు. గతంలో జిల్లా కేంద్రమైన ఏలూరులో పలు ఛానళ్ళకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఇదే అభిప్రాయాన్ని వెల్లడించినట్టు ఎంపీ శ్రీధర్ తెలిపారు. ఈయన తన అభిప్రాయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎంపీ అభిమానులు ఒత్తిడి చేయటం మొదలు పెట్టారు. చింతలపూడి నియోజకవర్గం కోటగిరి కోటగా ఉండేది. ఎంపీ శ్రీధర్ తండ్రి దివంగత కోటగిరి విద్యాధరరావు 1983 నుంచి 2004 వరకు నియోజకవర్గంలో తిరుగులేని నాయకునిగా కొనసాగారు. ఎమ్మెల్యేగా గెలుపొందుతూ వివిధ శాఖలకు మంత్రిగా పనిచేసిన విద్యాధరరావు తనయుడు శ్రీధర్ తండ్రి రాజకీయ వారసత్వాన్ని అందుకుని ఏలూరు పార్లమెంటు స్థానంలో ఎంపీగా మంచి మెజార్టీతో విజయం సాధించారు. కోటగిరి వారసులకు చింతలపూడి నియోజకవర్గంలో పార్టీలకు అతీతంగా అభిమానులు ఉన్నారు. ఈ కుటుంబంపై ఆశలు పెట్టుకున్న వారు ఎందరో ఉన్నారు. ఎంపీగా ఉన్న శ్రీధర్ ఈసారి ఎన్నికల్లో నిలబడబోనని చెప్పటంతో అభిమానులు కలవరపడుతున్నారు. ఈయన ప్రత్యక్ష రాజకీయాలలో ఉండాల్సిందేనని తమ అభిప్రాయాన్ని వ్యక్తం చేస్తున్నారు. అభిమానుల కోరిక, ఒత్తిడితో ఎంపీ ఎటువంటి నిర్ణయం తీసుకుంటారోనని రాజకీయ వర్గాలలో ఆసక్తి నెలకొంది. ఎంపీ ప్రత్యక్ష రాజకీయాలలో ఉండేందుకు ఎటువంటి చర్యలు తీసుకోవాలనేదానిపై అభిమానులు సమాలోచనలు చేస్తున్నారు.

ఇంటి నుంచి వెళ్ళి శవమయ్యాడు

విశాలాంధ్ర - లింగపాలెం : ఇంటి నుంచి బయటకు వెళ్ళిన టీసీహెచ్ఆర్ పాలెంలోని వేంపాటి ప్రసాదరావు(57) చాట్రాయి వ్యవసాయ శాఖ కార్యాలయం సమీపంలో శవమై కనిపించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మృతుడు మిర్చి వ్యాపారం చేస్తుంటాడు. ఆర్థికపరమైన లావాదేవీలతో కొంతకాలంగా ఇబ్బందులు పడుతున్నట్టు స్థానికులు తెలిపారు. బుధవారం ఇంటి నుంచి వెళ్ళిన ప్రసాదరావు శుక్రవారం శవమై కనిపించాడు. దీనిపై చాట్రాయి పోలీసులు కేసు నమోదు చేశారు. మృతునికి భార్య, కుమార్తె ఉంది. మృతుడు ఉన్న ప్రాంతానికి స్థానికులు పెద్ద సంఖ్యలో తరలివెళ్ళారు.

కరెంటు కోతలతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి

విశాలాంధ్ర - లింగపాలెం : కరెంటు కోతలతో లింగపాలెం మండల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కరెంటు ఎప్పుడు ఉంటుందో ? ఎప్పుడు పోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. వేసవిని తలపించే ఎండలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు కరెంటు కోతలతో తల్లడిల్లుతున్నారు. గ్రామాలలో దోమలు విపరీతంగా ఉన్నాయి. దోమల వల్ల అనేక మంది వ్యాధుల బారిన పడుతున్నారు. కరెంటు ఉంటే ఫ్యాన్లకు వీటి బెడద కొంత తగ్గుతుంది. రాత్రి సమయంలో కరెంటు తీసివేయటంతో మండల ప్రజలు నిద్రలేకుండా రాత్రులు జాగారం చేస్తున్నారు. వేసవిలో కూడా ఇటువంటి కోతలులేవు. ఇప్పుడు కోతలు విధించటంతో ప్రజలు ఆగ్రహిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా కరెంటు నిలిపివేస్తున్నారు. కోతలు లేకుండా విద్యుత్ సరఫరా చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మాలల చైతన్య మహాసేన జిల్లా అధ్యక్షుడిగా ఏసు

విశాలాంధ్ర - ఉండి : మాలల చైతన్య మహాసేన పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఉండి మండలం చినపుల్లేరు గ్రామానికి చెందిన సీనియర్ దళిత నేత కోనాల ఏసేబు(యేసు) ఎంపికైనట్టు మాలల చైతన్య మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు తోకల రాజేష్ బాబు ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాలల చైతన్య మహాసేన రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఏలూరు జిల్లాలో శుక్రవారం జరిగిందని, అందులో భాగంగా పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా కోనాల ఏసేబును రాష్ట్ర కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు తెలియజేశారు. అనంతరం నియమక పత్రాన్ని మాలల మహాసేన రాష్ట్ర అధ్యక్షుడు తోకల రాజేష్ బాబు చేతుల మీదుగా పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన కోనాల ఏసేపు అందుకున్నారు.

పాఠశాల వాచ్‌మెన్ దుర్మరణం

విశాలాంధ్ర - ముదినేపల్లి : పాఠశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్న వ్యక్తి రోడ్డు దాటుతుండగా కారు ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని పెదపాలపర్రు జడ్పీ ఉన్నత పాఠశాలలో వాచ్ మెన్ గా పనిచేస్తున్న తొడబాని పోలినాయుడు (65) తన ఇంటి నుండి పాఠశాలకు వెళుతుండగా రహదారిపై గుడివాడ నుండి భీమవరం వైపుకు వెళుతున్న కారు సైడ్ అద్దం తగలడంతో కిందపడి తలకు బలమైన గాయం కావడంతో మృతి చెందాడు. మృతుని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై డి. వెంకట కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కౌలు రైతులకు రైతు భరోసా

- **పీఎం కిసాన్ కింద 11,676 మంది రైతులకు రూ. 8.76 కోట్ల లబ్ధి**
- **జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బి. లావణ్యవేణి**

విశాలాంధ్ర - ఏలూరు : జిల్లాలో రైతు భరోసా - పీఎం కిసాన్ పథకం కింద ప్రస్తుత ఏడాదిలో మొదటి విడతలో 11,676 మంది కౌలు రైతుల ఖాతాలకు 8.76 కోట్ల రూపాయలు జమ చేసినట్టు జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ బి. లావణ్యవేణి చెప్పారు. తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి వరుసగా 5వ ఏడాది మొదటి విడతగా కౌలు రైతులకు వైఎస్ఆర్. రైతు భరోసా కింద రూ.7500 చొప్పున 1.46 లక్షల మంది ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతులు, దేవాదాయ భూములు సాగుదారులకు కలిపి రూ. 109.74కోట్లు, ఏ సీజన్ లో జరిగిన పంట నష్టానికి ఆ సీజన్ ముగిసేలోగానే పరిహారం అందిస్తున్నారు. ఈ ఏడాది మే నుంచి ఆగస్టు నెల వరకు కురిసిన అధిక వర్షాలకు నష్టపోయిన 11,373 మందికి రూ. 11.01కోట్లు ఇన్ పుట్ సబ్సిడీని ముఖ్యమంత్రి జగన్ విడుదల చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఏలూరు జిల్లా కలెక్టరేట్ నుంచి ఇంఛార్జి జిల్లా కలెక్టర్ బి. లావణ్యవేణి, జిల్లా వ్యవసాయ సలహామండలి అధ్యక్షులు వెజ్జు వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి వై. రామకృష్ణ, ఉద్యానశాఖ డిడి ఎస్.రామ్మోహన్ ,పలువురు కౌలు రైతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంఛార్జి కలెక్టర్ బి. లావణ్యవేణి మాట్లాడుతూ జిల్లాలో 5వ ఏడాది వైఎస్ఆర్ రైతు భరోసా - పియం కిసాన్ పథకం కింద 2023-24 ఆర్థిక సంవత్సరంలో మొదటి దఫా కింద 7,500 రూపాయలు చొప్పున 11,621 మంది ఎస్సీ, ఎస్టీ, బి.సి., మైనారిటీ వర్గాలకు చెందిన కౌలు రైతుల ఖాతాలకు రూ. 8.72 కోట్లు, ఎండోమెంట్ రైతులు 55 మందికి రూ. 4 లక్షలు వారి ఖాతాలకు జమచేసినట్టు తెలిపారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ వెజ్జు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వై.ఎస్.ఆర్. రైతు భరోసా కింద సంవత్సరానికి రూ. 13వేల 500 చొప్పున 5 సంవత్సరాలకు రూ. 67,500 రైతుల ఖాతాల్లో జమ చేయడం జరుగుతుందన్నారు.

అప్రకటిత విద్యుత్ కోతలతో అల్లాడుతున్న ప్రజలు

విశాలాంధ్ర - నిడమర్రు: మండలంలో అప్రకటిత విద్యుత్తు కోతలతో ప్రజలు నరకయాతన అనుభవిస్తున్నారు. రాత్రి 9.30 గంటల నుంచి పల్లెల్లో కరెంటు కోత విపరీతంగా ఉండటం, ఉక్కపోత, దోమల బెడద తో నిద్రలేకుండా గడుపుతున్నారు. వేసవి కాలం కన్నా దారుణంగా విద్యుత్ కోత ఉంటుందని మండల ప్రజలు శుక్రవారం వాపోయారు. మండల కేంద్రమైన నిడమర్రు లో కూడా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నారు. స్టేట్ లోడ్ డిస్పాచ్ సెంటర్ నుంచి వచ్చే సూచనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లోని ఉపకేంద్రాల వారీగా విద్యుత్ కోతలు అమలు చేస్తున్నామని విద్యుత్ శాఖ అధికారులు అంటున్నారు. విద్యుత్ కోతలు ఇలాగే ఉంటే ఆందోళన చేస్తామని ప్రజలు అంటున్నారు. మండల కేంద్రమైన నిడమర్రులో ఒక్క ప్రభుత్వ ఉద్యోగి స్థానికంగా నివాసం ఉండరని, ఎటువంటి సమస్యలైనా సామాన్య ప్రజలే ఎదుర్కోవాల్సి వస్తుందని వారు అన్నారు.

గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలి

విశాలాంధ్ర - గణపవరం: గణపవరం మండలం సి. హెచ్. అగ్రహారం గ్రామంలో ఫ్రై డే డ్రై డే పై అవగాహన, సంపూర్ణ పారిశుధ్య నివారణ చర్యలు శుక్రవారం చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ చుక్క అప్పారావు మాట్లా డుతూ గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచవలసిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ఆరోగ్య సహాయకుడు నామాల రాజు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రత మన అందరి బాధ్యత అని, ఇంటిచుట్టూ పరిసర ప్రాంతాల్లో కొద్దిపాటి నీరు నిల్వ వుండుట వలన దోమలు పెరుగుతాయని అన్నారు. ఈ కార్యక్రమంలో యు.పి స్కూల్ హెచ్ఎం రవి కుమార్,ఉపాధ్యాయులు చింతలపాటి దుర్గ భవానీ,రమేష్,ఎంపీటీసీ పి.వి.నారాయణ, గ్రామ కార్యదర్శి స్రవంతి, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

కొత్త పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర-మండవల్లి: పేదల సంక్షేమానికి వైసీపీ ప్రభుత్వం తొలి ప్రాధాన్యత ఇస్తుందని మండవల్లి గ్రామ సర్పంచ్ మెండా ఝాన్సి అన్నారు. కొత్తగా మంజూరైన పింఛన్ల సొమ్మును లబ్దిదారులకు శుక్రవారం మండవల్లి గ్రామ సచివాలయం లో వార్డు సభ్యులతో కలిసి అందించారు. 13 మందికి కొత్త పింఛన్లు అందించి ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ వార్డు సభ్యులు దూసనపూడి నాంచారయ్య, బి.స్వాతి, గుడివాడ మురళీలతో పాటు వైసీపీ నాయకులు మెండా సురేష్‌బాబు, సచివాలయ సిబ్బంది,వలంటీర్లు పాల్గొన్నారు.

కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు

విశాలాంధ్ర - గణపవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా విద్యపై దృష్టి పెట్టి కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు ఉంగుటూరు శాసనసభ్యులు పుప్పాల శ్రీనివాసరావు (వాసు బాబు) తెలిపారు. శుక్రవారం గణపవరం ప్రభుత్వ బాలుర హైస్కూల్లో రెండు కోట్ల అంచనా వ్యయంతో 12 అదనపు తరగతి గదులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ స్కూళ్ల కన్నా ప్రభుత్వ పాఠశాలలు నాడు నేడు కార్యక్రమంలో అభివృద్ధి చేసినట్టు పేర్కొన్నారు. రాబోయే కాలంలో పాఠశాలలు మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తానని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, రాష్ట్ర సూర్య బలిజ కార్పొరేషన్ చైర్మన్ శెట్టి అనంతలక్ష్మి, ఎంపీపీ దండు వెంకటరామరాజు(అర్థవరం రాము), జెడ్పీటీసీ సభ్యులు దేవరపు సోమలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్‌తో అందరికీ శుద్ధమైన నీరు

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికి శుద్ధమైన నీరు, కుళాయి లేని ఇంటికి ఉచిత కుళాయిలు ఏర్పాటు చేస్తున్నట్లు సర్పంచ్ ముప్పిడి విజయకుమారి తెలిపారు. పరింపూడి ఎస్సీ ఏరియాలో లక్షా ఇరవై వేల లీటర్ల సామర్థ్యం కలిగిన వాటర్ ట్యాంక్ నిర్మాణ పనులను ఎంపీపీ గంజిమల రామారావు ప్రారంభించారు. అవసరమైన చోట్ల కొత్త పైప్ లైన్లు గతంలో జెడ్పీటీసీ నిధులతో వేసిన 2 బోర్ల నీటిని అవసరమైన ఏరియాలకు అనుసంధానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఫుడ్ కమిషన్ డైరెక్టర్ గంజిమల దేవి, వైస్ ఎంపీపీ మట్ట వనజ, గంటశాల శ్రీనమ్మ, వార్డు సభ్యులు మాడుగుల సువార్త, పూలపల్లి రవి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు ఆటవస్తువుల వితరణ

విశాలాంధ్ర-ముసునూరు: చుక్కపల్లి ఐటీఐ ఛారిట్రబుల్ ట్రస్టు ఛైర్మన్ సుధ పాఠశాలకు ఆటవస్తువులను వితరణ చేశారు. శుక్రవారం మండలంలోని రమణక్కపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రూ.ఇరవై వేలు విలువ చేసే ఆటవస్తువులను ప్రధానోపాధ్యా యులు పివియస్ రామకృష్ణారావు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగరాజు మాస్టారులకు ఆమె ఆటవస్తువులను అందచేశారు. ఈ సందర్భంగా సుధ విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ తల్లిదండ్రులను, ఉపాధ్యాయు లను పెద్దలను గౌరవించాలని, పాఠశాల, గ్రామ అభివృద్ధికి కృషి చేయాలని సూచించారు.

ఉచిత బస్సు పాసులు వినియోగించుకోవాలి

విశాలాంధ్ర - గణపవరం: పేద విద్యార్థులు ఉచితంగా అందజేసే ఆర్టీసీ బస్సు పాసులను వినియోగించుకోవాలని ఉంగుటూరు శాసనసభ్యులు శ్రీనివాస రావు (వాసుబాబు) అన్నారు. శుక్రవారం గణపవరం జిల్లా పరిషత్ హై స్కూల్ (బాలికలు), జిల్లా పరిషత్ హై స్కూల్(బాలుర) లలో పాఠశాలలో చదువుతున్న పేద విద్యార్థిని విద్యార్థులకు ఉచిత బస్సు ప్రయాణ పాసులను 250 మందికి ఎమ్మెల్యే అందజేశారు. రెండు పాఠశాలలో చదువుచున్న బాలికలు, బాలుర లకు బస్సు పాసులకు అయ్యే ఖర్చును దాత వైఎస్ఆర్సిపి నాయకులు కాకర్ల విష్ణు శ్రీనివాసరావు ఆర్థిక సౌజన్యంతో అందజేశారు. గ్రామ సర్పంచ్ మూరా అలంకారం, ఆర్టీసీ తాడేపల్లిగూడెం డిపో మేనేజర్ వై ఎస్ ఎన్ మూర్తి మూర్తి, ఆర్టీసీ పిఆర్ఓ డి విజయ్ కుమార్, తహసిల్దార్ పి. లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు దేవవరపు సోమలక్ష్మి, దండు రాము, రెండు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం

విశాలాంధ్ర-పాలకొల్లు: పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు పట్టణంలోని వెలమ గూడెం 20వ వార్డులో, స్థానిక హారిక చికెన్ సెంటర్ ఎదురుగా అప్రోచ్ సిసి రోడ్డు నిర్మాణం జోరుగా జరుగుతున్నది. గతంలో ఇప్పటికే ఈ అప్రోచ్ రోడ్డును రెండు సార్లు నిర్మించారు. అయినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. అప్పుడు నిర్మాణం చేపట్టిన కాంట్రాక్టర్స్ నాణ్యతకు తిలోదకాలు ఇవ్వడం, అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో, ప్రస్తుతం ఆ అప్రోచ్ రోడ్డు పూర్తిస్థాయిలో కృంగిపోయి ప్రమాదభరితంగా తయారైంది. మునిసి పాలిటీ అప్రోచ్ రోడ్డు నిర్మాణ బాధ్యతలను స్వయంగా తీసుకుంది. రూ.3.66 లక్షల నిధులతో పాత అప్రోచ్ రోడ్డును తొలగించి నూతనంగా అప్రోచ్ రోడ్డును నాణ్యతా ప్రమాణాలతో నిర్మిస్తున్నట్లు మున్సిపల్ ఏఈ సతీష్ తెలిపారు. ప్రయాణికులు తమ రాకపోక లను ప్రధాన రహదారి గుండా కొనసాగించాలని కోరారు. సచివాలయం ఏమిలిటి సెక్రటరీ తేజ పర్యవేక్షించారు.

కొయ్యలగూడెం అభివృద్ధికి సహకరించాలి

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి రాగానే కొయ్యలగూడెం పట్టణ అభివృద్ధికి సహకరించాలని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు జేష్ట రామకృష్ణారావు అన్నారు. టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువ గళం పాదయాత్ర కొయ్యలగూడెం పట్టణం చేరుకోవడంతో నారా లోకేష్‌కు రామకృష్ణారావు వినతి పత్రాన్ని అందజేశారు. పట్టణంలోని ప్రధాన సమస్యలు ప్రభుత్వ ఆసుపత్రిని అభివృద్ధి చేయడం, పోలీస్ స్టేషన్ చుట్టూ వాణిజ్య వ్యాపార సముదాయ కాంప్లెక్స్ నిర్మాణం చేపట్టాలని, మండల కేంద్రమైన కొయ్యలగూడెం పట్టణంలో ఫైర్ స్టేషన్ ఏర్పాటు చేయాలని, ఏజెన్సీ ముఖద్వారం కొయ్యలగూడెం పట్టణంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలని లోకేష్ కు వినతిపత్రం అందజేశారు.

మండవల్లి శివాలయంలో లక్ష కుంకుమార్చన

విశాలాంధ్ర-మండవల్లి: శ్రావణమాసంలో ఆలయాలన్నీ భక్తులతో కిటకిటలాడు తున్నాయి. ఆలయాల్లో పూజా కార్యక్రమాలు నిర్వహించటానికి భక్తులు బారులు తీరుతున్నారు. మండవల్లిలో ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజిల్లుతున్న శ్రీభ్రమరాంభా సమేత మల్లేశ్వరస్వామి వారి ఆలయంలో శుక్రవారం అత్యంత వైభవోపేతంగా భ్రమరాంభ అమ్మవారికి లక్షకుంకుమార్చన పూజ వేద పండితుల ఆధ్వర్యంలో నిర్వహించగా భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అమ్మవారిని కరెన్సీ నోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు.

సంక్షేమ పథకాలు కొనసాగించాలి

విశాలాంధ్ర - నిడమర్రు: ప్రభుత్వం భవన నిర్మాణ కార్మికులకు నిలిపివేసిన సంక్షేమ పథకాలు కొనసాగించాలని, వైసిపి అధికారంలోకి వచ్చిన నాలుగున్నర సంవత్సరాల కాలంలో భవన నిర్మాణ కార్మికు లకు ఏ ఒక్క సంక్షేమ పథకం అమలు జరగ లేదని ప్రభుత్వం దారి మళ్లించి వాడుకున్న నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు నిధులను సంక్షేమ బోర్డుకు జమ చేయాలని, భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ బోర్డు చట్టాలు అమలు చేయాలని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నారపల్లి రమణారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం నిడమర్రు మండలం పెదనింద్రకొలను బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో మోటార్ సైకిల్ ర్యాలీని భవన నిర్మాణ కార్మిక సంఘం జెండా ఊపి ప్రారంభించారు. కార్మికులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ పెద నింద్రకొలను నుండి మండల కేంద్రమైన నిడమర్రు వరకు మోటార్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చినిమిల్లి రాంబాబు, గౌడ బత్తుల వాసు, కందులుపాటి సుబ్బారావు, పడాల శ్రీధర్,బుద్దల వెంకటేశ్వరరావు, తంగేళ్ల బాబురావు, మార్త రాజు,తదితరులు పాల్గొన్నారు.

పెన్షన్లు పంపిణీ

విశాలాంధ్ర-ఆకివీడు : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం పేదల కోసం నిరంతరం పని చేస్తుందని ఆకివీడు నగర పంచాయతీ 11వ వార్డు కౌన్సిలర్ దొడ్డి జగదీష్ అన్నారు. స్థానిక శాంతినగర్లో గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడు తున్న కుంచాడ మోహన్ రావుకు ప్రభుత్వం తరపున 5000 రూపాయలు పెన్షన్ అందజేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ కొన్నిసార్లు సర్టిఫికెట్ల వలన లబ్ధిదారులకు పథకాలు ఆలస్యం అవ్వడం జరుగుతుందని. ఖచ్చితంగా తమ వైసిపి ప్రభుత్వంలో బడుగు బలహీన హీన వర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు . అనంతరం 16 వ వార్డు కౌన్సిలర్ పడాల శ్రీనివాసరెడ్డి, గంటా శివ, వాలంటరీ వెంకటరమణలు మోహన్‌రావు భార్య సరస్వతికి 5000 రూపాయలు పెన్షన్ అందజేశారు.

రక్తదాన శిబిరం

విశాలాంధ్ర-ఆకివీడు : జనసేన అధినేత పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించు కుని శుక్రవారం ఆకివీడు మాది వాడి యూత్, ఏఎస్ ఎన్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉండి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి జుత్తిగ నాగరాజు మాట్లాడుతూ జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ఆశయ సాధన కోసం యువత కృషి చేయాలన్నారు. మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు తోట వాసు, కౌన్సిలర్ గోపిశెట్టి సత్యవతి, చిరంజీవి సత్యనారాయణ, నరహరిశెట్టి బాబి, ఉప్పు కోటేశ్వరరావు, బొల్లం వెంకటేష్, పాపోలు చిన్నోడు, దారపు రెడ్డి కన్నబాబు, నంద్యాల శివ, నంద్యాల రేష్మ , నాగపూర్ణిమ తో పాటు జనసేన కార్యకర్తలు, పవన్ కళ్యాణ్ అభిమానులు పాల్గొన్నారు.

పునరావాస కాలనీల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

విశాలాంధ్ర-జీలుగుమిల్లి : మండలంలోని పునరావాస కాలనీల మౌలిక వసతుల అభివృద్ధి ధ్యేయంగా ప్రభుత్వం కృషి చేస్తుందని పోలవరం శాసనసభ్యులు తెల్లం బాలరాజు అన్నారు. శుక్రవారం ఎర్రవరం వాడపల్లి కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాసితులకు ఫస్ట్ స్టేజిలో నగదు పడని వారిని గుర్తించి నగదు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులు ఆదేశించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఉపాధి కార్డులు మంజూరు చేయాలని అన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వంక వారి గూడెం గ్రామంలో సిసి రోడ్డుకు 30 లక్షల రూపాయలు, చంద్రమ్మ కాలనీ సీసీ రోడ్డుకు రూ.30 లక్షలతో ఆయన శంకుస్థాపన చేశారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో 15వ ఆర్థిక సంఘం నిధులతో 50 లక్షల రూపాయలతో బ్లాక్ పబ్లిక్ యూనిట్కు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కోరస పోచమ్మ, సర్పంచ్ చిర్రి జగదాంబ, వైయస్సార్ పార్టీ సీనియర్ నాయకులు సంద ప్రసాద్, ఏఎంసీ కమిటీ సభ్యులు జీలుగుమిల్లి సొసైటీ అధ్యక్షులు బోధ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

న్యాయ సేవలపై అవగాహన

విశాలాంధ్ర - భీమవరం : మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో స్థానిక భీమవరం తాలూకా తాపీ పనివారల సంఘం భవనంలో "అసంఘటిత రంగంలోని పనివారికి న్యాయ సేవలు " అనే అంశంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్యానల్ లాయర్లు పి. అంబేద్కర్, డి. రవి కిరణ్, అసిస్టెంట్ లేబర్ కమిషనర్ ఎ. లక్ష్మి ముఖ్య అతిథులుగా హాజరై రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే వివిధ సంక్షేమ పథకాలు అమలుపై తాపీ పనివార్లకు అవగాహన కల్పించారు. సంక్షేమ పథకాలు లబ్ధి దారులకు అందకపోతే న్యాయ సేవాధికార సంస్థ వారికి దరఖాస్తు రూపంలో తెలియజేయవచ్చునన్నారు. అందరూ తప్పని సరిగా ఆయా రంగాలలో పనిచేస్తున్న వారు రిజిస్టర్ అయ్యి ఉండాలన్నారు. భవన నిర్మాణ సంక్షేమ బోర్డ్, చేతి వృత్తులు వాటి సంక్షేమ కార్పొరేషన్ వంటి సంస్థల ద్వారా అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందరూ తెలుసుకోవాలని, పని చేసే సమయంలో ఏదైన ప్రమాదానికి గురైతే సంబంధిత లేబర్ ఆఫీసర్ దృష్టికి తీసుకెళ్లి నష్టపరిహారాన్ని పొందే అవకాశం ఉందని ప్యానల్ లాయర్స్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ లేబర్ అధికారులు 1, 2 ఎస్.దుర్గారావు, కెవిఎస్ ఎన్.మల్లేశ్వరరావు, తాపీ పనివారల సంఘం అధ్యక్షుడు నల్లా సత్యనారాయణ, కార్యదర్శి పి. ఏడుకొండలు సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటింటికి సీపీఎం ప్రచారం

విశాలాంధ్ర - కొయ్యలగూడెం : గవరవరం గ్రామంలో ఒకటో వార్డు రెండో వార్డులో ఇంటింటి కి సిపిఎం ప్రచార కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు గ్రామంలో పర్యటిస్తూ కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజలకు వివరించారు. ధరలు తగ్గించాలి, దేశాన్ని రక్షించాలి, భారత రాజ్యాంగాన్ని, లౌకిక ప్రజాస్వామ్యాన్ని రక్షించు కోవాల్సిన అవసరం ఉందంటూ కరపత్రాలు పంచుతూ సంతకాల సేకరణ చేశారు. ఈ కార్యక్రమంలో శుక్ల బోయిన రాంబాబు, ఆకుల దుర్గారావు, కడియం సీతారాముడు, కె దుర్గారావు, శుక్ల బోయిన మహాలక్ష్మి, యస్ వెంకటలక్ష్మి, జక్కు విజయ, నక్కలపూడి దుర్గమ్మ ,చిలకంటి సత్యనారాయణ, జక్కు లక్ష్మి, శుక్ల బోయిన లక్ష్మి ,తదితరులు పాల్గొన్నారు.

ఆపద్బాంధవుడు ఎంపీపీ వాసురెడ్డి

విశాలాంధ్ర - పెనుమంట్ర: ఎవరికైనా కష్టం వస్తే మనకెందుకులే అనుకునే రోజులు ఇవి.. కష్టకాలంలో ఉన్న జర్నలిస్టును ఆదుకునేం దుకు తన వంతు సహాయంగా ముందుకు వచ్చిన మండల అధ్యక్షుడు కర్రి వెంకటనారాయణ రెడ్డి (వాసు రెడ్డి)కి ఆచంట నియోజకవర్గ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా తరపున హృదయపూర్వక సుమాంజలి తెలిపింది. ఇటీవల కాలంలో తీవ్ర అనారోగ్యం(క్యాన్సర్) తో బాధపడుతున్న అందరికీ సుపరిచితుడు పెనుమంట్ర మండలం మార్టేరు గ్రామానికి చెందిన జర్నలిస్టు వార్త నాగ భూషణం క్యాన్సర్‌కు ఆర్థిక ఇబ్బందులతో ట్రీట్మెంట్ చేయించు కోవడానికి తీవ్ర ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా వాసు రెడ్డి వారి కుటుంబానికి 25,000 రూపాయలు ఆర్థిక సహాయాన్ని అందించి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో రాష్ట్ర విద్యా సంక్షేమ మౌలిక వసతుల అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్ కొవ్వూరు వేణుమాధవ్ రెడ్డి, మార్టేరు వైసిపి గ్రామ అధ్యక్షులు చిర్ల సత్యనారాయణ రెడ్డి, వెలగలేరు గ్రామ అధ్యక్షులు కర్రి సురేష్ రెడ్డి మరియు జర్నలిస్టులు పాల్గొన్నారు.

9న లోక్ అదాలత్

విశాలాంధ్ర-ఆకివీడు : ఈ నెల 9వ తేదీన జరగబోయే జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకొని సత్వర న్యాయం కోసం రాజీ మార్గాన్ని ఎంచుకోవాలని భీమవరం మండల న్యాయ సేవాధికారా సంస్థ ప్యానల్ లాయర్ బంటుమిల్లి సురేష్ కుమార్ అన్నారు. ఈరోజు ఆకివీడు మండలం దుంపగడప గ్రామ సచివాలయం నందు నిర్వహించిన చట్టాలపై అవగాహన సదస్సులో ఆయన పాల్గొని జాతీయ లోక్ అదాలత్ ద్వారా కక్షిదారులకు సమన్యాయం పొందవచ్చని గ్రామ వాలంటీర్లు ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలియపరచాలని కోరారు. ఆయా కోర్టులలో పెండింగులో ఉన్న సివిల్ తగాదాలు, పోలీస్ కేసులు, మనోవర్తి కేసులు, మోటార్ వెహికల్ ప్రమాద భీమా కు సంభందించిన కేసులు , చెక్ బౌన్స్ కేసులు రాజీ చేసుకొనదలచిన కక్షిదారులు తమతమ న్యాయవాదులను, సంభందిత పోలీస్ వారిని లేదా సంభందిత కోర్ట్ వారిని అర్జీ రూపంలో సంప్రదించి కేసుల నుండి విముక్తి పొందాల న్నారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు బి. లోకేశ్వర రావు, ఆకివీడు ఎస్ఐ ఫణి మోహన్, పారా లీగల్ వాలంటీర్ వై డి కృపావరం, దుంప గడప సర్పంచ్ ముద్దే విశ్వేశ్వరరావు , కార్యదర్శి రఘునాథ రావు, మాణిక్యాలరావు, గ్రామ వాలంటీర్లు గ్రామస్థులు పాల్గొన్నారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమం

విశాలాంధ్ర - యలమంచిలి : పాలకొల్లు నియోజకవర్గ పరిధిలోని యలమంచిలి మండలం యలమంచిలి గ్రామంలో శుక్రవారం కొత్తగా మంజూరైన పెన్షన్లను అర్హులైన 30 మందికి పాలకొల్లు నియోజకవర్గ వైసిపి ఇంచార్జ్ గుడాల శ్రీహరి గోపాలరావు (గోపి) చేతుల మీదుగా లబ్ధిదారులకు అందజేశారు. దీంతో కలిపి, యలమంచిలి లో మొత్తం ఎనిమిది వందల పన్నెండు మంది పేద ప్రజలకు పెన్షన్ సదుపాయం అందిందని, ఇంకా అర్హులైన ప్రతి ఒక్కరికి పెన్షన్ సంక్షేమ పథకాలు అందించడమే ప్రభుత్వ ధ్యేయమని గుడాల గోపి అన్నారు. ఈ కార్యక్రమం లో యలమంచిలి మండల కన్వీనర్ పోతూరి బుచ్చి రాజు,యలమంచిలి ఎంపీపీ రావూరి బుజ్జి, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, వైసీపీ ముఖ్య నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

డిఎన్ఆర్‌లో ప్రాంగణ ఎంపికలు

విశాలాంధ్ర -భీమవరం: డిఎన్ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో విశాఖపట్నంకు చెందిన ఎస్ వివిఎస్ ఎం ఈ పి సొల్యూషన్స్ ప్రాంగణ ఎంపికలు శుక్రవారం నిర్వహించింది. ఈ సందర్భంగా సీఈఓ గౌతమ్ కుమార్ మాట్లాడుతూ బిజినెస్ ఇన్ఫర్మేషన్, మోడలింగ్ సర్వీసెస్, ఆర్కిటెక్చర్, కనస్ట్రక్షన్ రంగాల్లో ఉపాధి అవకా శాలు మెండుగా ఉన్నాయన్నారు. సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ విద్యార్థుల కోసం పలు రంగాలు ఎదురు చూస్తున్నా యన్నారు. అవకాశాలను ఉపయోగించుకుని విద్యార్థులు విజయం సాధించాలని ఆయన విపులీకరించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.అంజన్ కుమార్, వివిధ విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు ఉంగుటూరు మండలంలో లోకేష్ పాదయాత్ర

విశాలాంధ్ర- ఉంగుటూరు : తెలుగుదేశం పార్టీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ యువ గళం పాదయాత్ర 2వ తేదీ శనివారం ఉంగుటూరు మండలంలో ప్రవేశిస్తుందని ఏలూరు జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు విలేకరులకు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్ల మండలం సింగరాజుపాలెం గ్రామం నుంచి 2వ తేదీన ఉంగుటూరు మండలం నీలాద్రిపురం లో ప్రవేశిస్తుందని అనంతరం యాదవ సామాజిక వర్గంతో మాట మంచి కార్యక్రమంలో పాల్గొంటారని అన్నారు .

సీపీఎం నిరసన

విశాలాంధ్ర - ముమ్మిడివరం : ముమ్మిడివరం సిపిఎం ఆధ్వర్యంలో మండలంలోని అయినాపురం సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. పెంచిన విద్యుత్ చార్జీలు ఉపసంహరించు కోవాలని, నిత్యవసర ధరలు తగ్గించి ఉద్యోగాలను కల్పించాలని కోరుతూ సచివాలయం కార్యదర్శికి వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు దుర్గాప్రసాద్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నాటు సారా స్వాధీనం

విశాలాంధ్ర-కొవ్వూరు : కొవ్వూరు ఎస్సీబీ సత్యనారాయణ తన సిబ్బందితో చాగల్లు మండలం చాగల్లు గ్రామంలో శుక్రవారం దాడులు నిర్వహించారు. కోడి శ్రీనివాసరావు నుంచి రెండు లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకుని అరెస్టు చేశారు.

సామూహిక వరలక్ష్మీ వ్రతాలు

విశాలాంధ్ర - పిఠాపురం : పిఠాపురం శ్రీ రాజరాజేశ్వరి సమేత ఉమా కుక్కుటేశ్వర స్వామి ఆలయంలో వరలక్ష్మి వ్రత పూజా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. వరలక్ష్మీ వ్రతంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. తెల్లవారుజాము నుండి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే పెండెం దొరబాబు దంపతులు పాల్గొని మహిళలకు చీరలు పంపిణీ చేశారు. ఆలయ వేద పండితులచే ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ ఆగంటి ప్రభాకర్ రావు మాట్లాడుతూ ఆలయ ఈవో శ్రీనివాస్ నేతృత్వంలో ఎమ్మెల్యే పెండెం దొరబాబు ఆదేశాల మేరకు భక్తులకు తగు ఏర్పాట్లు చేశామని ఈ వ్రతంలో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించమని, సుమారు 5000 మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారని తెలిపారు. పిఠాపురం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

జగన్ పాలన అంతమొందించేందుకే ప్రజావేదిక

విశాలాంధ్ర - ఆత్రేయపురం : జగన్ పాలన అంతమొందించేందుకే తెలుగుదేశం పార్టీ ప్రజావేదిక కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని ఆ పార్టీ ఉపాధ్యక్షులు, నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి బండారు సత్యానందరావు అన్నారు. ఆత్రేయపురం మండలం వాడపల్లి గ్రామంలో వెంకటేశ్వరస్వామి దేవాలయం వద్ద ప్రజావేదిక కార్యక్రమాన్ని ప్రారంభించారు. గ్రామాలలో పర్యటించి ప్రజావేదిక ఏర్పాటు చేసి అవినీతి వద్దు, ఆరాచకం వద్దు,క్రైమ్ వద్దు అని సంతకాల సేకరణ చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ముదునూరి వెంకటరాజు (గబ్బర్ సింగ్), మట్ట లక్ష్మి ఎంపీటీసీ ఉచ్చిలి, కరుటూరి నరసింహారావు, నియోజకవర్గ పరిశీలకులు వాసిరెడ్డి రాంబాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలు భర్తీ చేయాలి

విశాలాంధ్ర - పిఠాపురం : ప్రభుత్వ రంగ సంస్థల్లో ఖాళీలు వెంటనే భర్తీ చేయాలని సిపిఎం పిలుపులో భాగంగా ఇందిరానగర్ సచివాలయం వద్ద ధర్నా నిర్వహించారు. నాయకులు కే.చిన్న, కే.రాజు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రభుత్వ రంగ సంస్థల్లో ఉన్న ఖాళీ పోస్టులన్నీ భర్తీ చేయాలని చదువుకున్న విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు శ్రీరామదాసు, గంగన్న, సూర్యనారాయణ, అప్పన్న, రమణ. రాజేష్, జి. అప్పారావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

కార్మికులంతా ఐక్యంగా ఉండాలి

విశాలాంధ్ర - నిడదవోలు : భవన నిర్మాణ కార్మిక రంగం నిర్వీర్యం కాకుండా ఉండాలంటే కార్మికులంతా ఐక్యంగా ఉండాలని యూనియన్ ప్రెసిడెంట్ ఖండవల్లి వీర వెంకట్రావు అన్నారు. నిడదవోలు మండలం శెట్టి పేటలో ఐ.యఫ్.టి.యు అనుబంధ ప్రగతిశీల భవన నిర్మాణ కార్మిక సంఘం సమావేశం నిర్వహించారు. అధ్యక్షత వహించిన వెంకట్రావు మాట్లాడుతూ భవన నిర్మాణ రంగానికి చెందిన కార్పెంటర్ లు, పెయింటర్స్, ప్లంబర్స్, తాపి, ఎలక్ట్రికల్ తదితరులు అందరూ ఐక్యంగా వుండి తమ సమస్యలు పరిష్కారం కోసం పోరాడాలన్నారు. ఐ.యఫ్.టి.యు జిల్లా సహాయ కార్యదర్శి ఈమని గ్రీష్మ కుమార్ మాట్లాడుతూ దేశంలో నిర్మాణ సామాగ్రి ధరలు అదుపు తప్పిన ఫలితంగా భవన నిర్మాణ రంగం కుదేలైందన్నారు. పేద, మధ్యతరగతి ప్రజలు తమ నిర్మాణాలు నిలిపివేశారని, నిర్మాణ రంగం కుదేలై కార్మికులు తమ ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డారని, తక్షణమే పాలకులు స్పందించి ధరల అదుపు కు తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఖండవల్లి దుర్గారావు, పాటంశెట్టి రాజేష్, దిడ్ల నరేష్, విజయ్, రాజారావు, కందాళ సాయి, చిన్నం మూర్తి తదితరులు పాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ

విశాలాంధ్ర - నిడదవోలు : ఇంటికి వృద్ధాప్యంలో పెద్ద కొడుకులా,తోడు కోల్పోయిన వారికి తోబుట్టువులా పింఛను ఇచ్చి ఆర్థికంగా మమ్మల్ని ఆదుకుట్టున్న జగనన్నను సర్వదా కృతజ్ఞులమై ఉంటామని పలువురు నూతన పింఛను దారులు అన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో పట్టణంలో నూతనంగా మంజూరైన వృద్ధాప్య, వితంతు, వికలాంగుల, మత్స్యకార పెన్షన్లను శాసనసభ్యులు జి.శ్రీనివాస్ నాయుడు లబ్ధిదారులకు శుక్రవారం పంపిణీ చేశారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారుల అభిప్రాయాన్ని శ్రీనివాసనాయుడు అడిగి తెలుసుకున్నప్పుడు కుటుంబ పెద్దగా జగనన్న మమ్మల్ని అదుకుంటున్నాడన్నారు.అనంతరం శ్రీనివాస్ నాయుడు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో జన్మభూమి కమిటీలు సిఫార్సు చేసిన వారిలో కొద్ది మందికే పథకాలు అందేవన్నారు.జగనన్న ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ, వైస్ చైర్మన్లు జీ. వెంకటలక్ష్మి, యలగడ బాలరాజు, కౌన్సిలర్స్, మున్సిపల్ కమిషనర్ కే. వి. పద్మావతి, సచివాలయ సిబ్బంది వాలంటీర్స్ పాల్గొన్నారు.

గ్రంథాలయ స్థల దాత జయంతి

విశాలాంధ్ర-పెరవలి : ముక్కామల శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ భవన దాత ఇనప కోళ్ల అప్పారావు 97వ జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు కడియాల సాయి రామారావు అప్పారావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో గ్రంధపాలకులు ఎం.వెంకటేశ్వర్లు అక్కిన బలరాం, మద్దిపాటి సూర్యరావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీయూ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా బెజవాడ

విశాలాంధ్ర - కాకినాడ : జవహర్లాల్ నెహ్రూ టెక్నికల్ యూనివర్సిటీ కాకినాడ ఎగ్జిక్యూటివ్ మెంబర్‌గా కాకినాడ రూరల్ మండలం తిమ్మాపురం గ్రామ సర్పంచ్ బెజవాడ సత్యనారాయణ నియమితులయ్యారు. ఈ పదవి కాలం మూడు సంవత్సరాల పాటు కొనసాగుతుందని సదరు నియామక పత్రంలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా బెజవాడ మాట్లాడుతూ తనకు ఈ అవకాశం కల్పించిన మాజీ మంత్రి, ఎమ్మెల్యే కురసాల కన్నబాబుకు, ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యూనివర్సిటీ అభివృద్ధికి కృషి చేస్తానని తెలిపారు. ఎక్జిక్యూటివ్ మెంబర్‌గా నియమితులైన బెజవాడకు పలువురు వైఎస్ఆర్సీపీ నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలిపారు.

ఏనుగువాని లంకలో గుడాల గోపి పర్యటన

విశాలాంధ్ర - పాలకొల్లు : యలమంచిలి మండలం ఏనుగువానిలంక గ్రామంలో వైఎస్ఆర్సిపి పాలకొల్లు నియోజకవర్గ ఇంచార్జ్ గుడాల గోపి శుక్రవారం పర్యటించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో భాగంగా అంబేద్కర్, వైయస్ రాజశేఖర్ రెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం వైసీపీ పార్టీ జెండాను ఆవిష్కరించారు. గుడాల గోపి మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీని ప్రజలు ఆశీర్వదించాలని కోరారు. ఏనుగువాని లంక గ్రామంలో ఇప్పటి వరకు వృద్ధాప్య ఫించన్ లు 634 ఉండగా, ఈ నెల నుచి కొత్తగా, మరొక 23 ఫించన్లను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందని గోపి అన్నారు. కార్యక్రమంలో భాగంగా నూతన పింఛన్లను ఇంచార్జ్ గుడాలగోపి చేతుల మీదుగా పంపిణీ చేశారు. యలమంచిలి మండల కన్వీనర్ పోత్తూరి బుచ్చిరాజు, మండల ఎంపీపీ రావూరి వెంకటరమణ (బుజ్జి), మాజీ డీసీఎంఎస్ చైర్మన్ యడ్ల తాతాజీ, వైసీపీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

'వికాస'లో 4న జాబ్‌మేళా

విశాలాంధ్ర - కాకినాడ : "వికాస" కార్యాలయంలో ఈ నెల 04వ తేదీ సోమవారం జాబ్‌మేళా నిర్వహించనున్నారు. ఫ్లూయిస్ట్ కంపెనీలో బిడిఇ, జికె గ్రూప్స్ లిమిటెడ్లో క్వాలిటీ కంట్రోల్, అకౌంట్స్ & కలెక్షన్, సేల్స్ & మార్కెటింగ్, ఎసి వివిఎల్ సర్వే & కనస్ట్రక్షన్ ప్రై.లిలో హెచ్ఆర్, సాఫ్ట్వేర్ ఇంజనీర్, మెకానికల్, సాఫ్ట్వేర్ ఇంజనీర్, హనీ గ్రూప్ కంపెనీలో రిలేషన్ షిప్ మేనేజర్, బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్, సీనియర్ బిజినెస్ డెవలప్మెంట్ మేనేజర్, అపర్ణ ఎంటర్ప్రైజస్ లి.లో ట్రైనీ ల్యాబ్ టెక్నిషియన్, నిట్ ఐసిఐసిఐ బ్యాంక్లో రిలేషన్ షిప్ మేనేజర్, డెక్కన్ కెమికల్స్ కంపెనీలో ట్రైనీ (ప్రొడక్షన్), డిక్సాన్, హెూండాయ్ మోబీస్ కంపెనీల్లో టెక్నిషియన్ ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. అలాగే డిడియుజికెవై స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్ ద్వారా ట్రైనింగ్ ఇచ్చి ఉద్యోగం కల్పించనున్నారు. పై ఉద్యోగాలకు ఎస్ఎస్సి, ఇంటర్, ఐటిఐ, డిప్లొమో, డిగ్రీ, బి టెక్, బి.టెక్ మైక్రోబయోలజీ, ఎంబిఎ & ఎంటెక్ ఉత్తీర్ణులైన 35 సం.లోపు అభ్యర్థులు అర్హులు. వీరికి నెలకు రూ. 12,000/- నుండి రూ. 25,000/ వరకు జీతం + ఇన్సెంటివ్స్, భోజనం, వసతి & రవాణా సౌకర్యం ఆయా ఉద్యోగాలను బట్టి ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులందరూ ఈ నెల 04వ తేదీ సోమవారం "వికాస కార్యాలయం, కలెక్టరేట్, కాకినాడ" వద్ద ఉదయం 9 గం.లకు సర్టిఫికెట్స్ జెరాక్స్‌తో హాజరుకావలెను. మరిన్ని వివరాలకు సెల్: 7799376333 సంప్రదించవలెను.

ఇసుజు డి మాక్స్ ఎస్ క్యాబ్ జెడ్ విడుదల

విశాలాంధ్ర-కాకినాడ: ఇసుజు మోటర్స్ ఇండియా తమ పూర్తి సరికొత్త డి మాక్స్ ఎస్ క్యాబ్ జెడ్ వేరియంట్‌ను ఈరోజు భారతదేశంలో విడుదల చేసింది. ఇది వాణిజ్య వాహన విభాగంలో 'స్మార్టెస్ట్'గా కనిపించే క్రూ-క్యాబ్ పికప్ సాధారణత కు మించిన ('బియాండ్ ది ఆర్డినరీ') వాహనము. ఇది స్మార్ట్ లుక్స్, కఠినమైన మరియు మన్నికైన వర్క్‌హార్స్ సామర్థ్యం, భద్రత మరియు ప్రయాణీకుల తరహా సౌకర్యం వంటి కలయికతో భారతదేశంలో పికప్ సంస్కృతి స్ఫూర్తిని కలిగి ఉందని ఇసుజు మార్కెటింగ్ హెడ్ చెప్పారు. టాప్-ఎండ్ వేరియంట్ జోడింపుతో పాటు, ఇసుజు మోటర్స్ ఇండియా ఇప్పుడు అన్ని వ్యాపార వృత్తిపరమైన అవసరాల కోసం మరింత సమగ్రమైన వైవిధ్యమైన శ్రేణిని అందిస్తోందన్నారు. తమ వ్యాపార అవసరాల మరియు స్టైలిష్ లుకింగ్ వాహనం కోసం చూస్తోన్న అభివృద్ధి చెందుతున్న భారతీయ వ్యాపారవేత్తలు నిపుణుల ఆకాంక్షలను ఇసుజు డి మాక్స్ ఎస్ క్యాబ్ జెడ్ తీర్చనుందని, అధునాతనమైన సాంకేతికత ఫీచర్లతో లభ్యం అవుతుందని తెలిపారు.

ఘనంగా సామూహిక వరలక్ష్మి వ్రతాలు

విశాలాంధ్ర - పెద్దాపురం : కొరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన మంలదంలోని కాండ్రకోట నూకాలమ్మ, అమ్మవారు శుక్రవారం వరలక్ష్మీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కార్యనిర్వ హణాధికారి టీవీ సూర్యనారాయణ ఆధ్వర్యంలో అమ్మవారిని వేదపండితులు ఏకాతంగా అమ్మవారి సామూహిక వరలక్ష్మి వ్రత పూజ అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఏపీ హౌసింగ్ కార్పోరేషన్ చైర్మన్ చవులూరి దొరబాబు, జడ్పీటీసీ గవరసాని సూరిబాబు, ఈఓ టీవీ సూర్యనారాయణ, ఆలయ చైర్మన్ గవరసాని రామస్వామిల చేతుల మీదుగా భక్తులు అమ్మవారి రూపు, జాకెట్, పసుపు, కుంకుమ, గాజులను పంపిణీ చేశారు. సుమారు 1550 మంది మహిళలు ఈ పూజల్లో వరలక్ష్మి వ్రతం ఆచరించగా గ్రామ ఉప సర్పంచ్ జోకా నానాజీ, పీఏసీఎస్ అధ్యక్షులు వల్ల గంగారావు, కమిటీ సభ్యులు లక్కాకుల కృష్ణ, పార్టీ నాయకులు నాగబోయిన రాజుబాబు, గంటా రామస్వామి, గవరసాని రాజశేఖర్, ఒబిలిశెట్టి నాగభూషణం, వెంకటేశ్వరరావు, సుందరెడ్డి రాజు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.